క్లుప్తంగా

విద్యార్థులకు మొక్కల పంపిణీ



విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న ఆలీ

కె.గంగవరం: మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం గ్రామ గ్రీన్ కోర్ సమన్వయకర్త ఆలీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ మొక్కలను తల్లి పేరుతో ఇంటి వద్ద ప్రతి విద్యార్థి నాటాలన్నారు. దీంతో పాటు మొక్కను బాగా పోషించే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలని కోరారు. హెచ్ఎం ఎర్ర ఈశ్వరుడు మాట్లాడుతూ, పర్యావరణాన్ని రక్షించాలంటే మొక్కల పెంపకం ఒక్కటే మార్గమన్నారు. మొక్కలు బాగా పోషించాక నాలుగేళ్ల తరువాత ఆ విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చౌదరి, ఉపాధ్యాయులు కేవీ రామారెడ్డి, ఆర్ మాలిని తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ శాస్త్రీయంగా నిర్వహించాలి



కపిలేశ్వరపురంలో చెత్త సేకరణ తీరును పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ విజయలక్ష్మి

కపిలేశ్వరపురం: గ్రామాల్లో చెత్త సేకరణ శాస్త్రీయంగా నిర్వహించాలని రామచంద్రపురం డీఎల్‌డీఓ వి.విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. కపిలేశ్వరపురంలో నివాసితుల నుంచి చెత్తను సేకరిస్తున్న తీరును శుక్రవారం ఆమె మండల అధికారులతో కలసి స్వయంగా పరిశీలించారు. తడిచెత్త, పొడి చెత్తలను విభజించి పారిశుధ్య కార్మికులకు అందజేస్తున్న తీరును ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ వివరించారు. గ్రామంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి చేపడుతున్న చర్యలను ఈఓపీఆర్‌డీ మోహన్, కార్యదర్శి శివచక్రవర్తి వివరించారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న బీఎల్‌ఓలతో తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్

కాజులూరు: ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించేలా బీఎల్‌ఓలు కృషి చేయాలని తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో వివిధ గ్రామాలకు చెందిన బూత్ లెవల్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కొత్త ఓటర్ల నమోదు, మార్పులుచేర్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, మృతుల ఓట్ల తొలగింపు, ఓటర్ల నమోదులో తప్పొప్పులు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాలపై బీఎల్‌ఓలకు పరీక్షలు నిర్వహించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఆర్ఐ వేగేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు పెన్షనర్ల సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మండపేట శాఖ సమావేశం నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవళ్ల సత్యనారయణ, పెంకే గోవిందరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండలంలోని పట్టణం, గ్రామాల్లోని రిటైర్డ్ పెన్షనర్లు హాజరవుతారన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా 15న నిర్వహించతలపెట్టిన ధర్నా కార్యక్రమం నిర్వహణ, ఇన్‌కంటాక్స్, ఈహెచ్ఎస్ తదితర అంశాలపై చర్చిస్తామని సత్యనారాయణ, గోవిందరావు తెలిపారు.

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీల నియామకం

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని వ్యవసాయ సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించారు. నియమితులైన చెల్లూరు, ఏడిద చైర్మన్లు, సభ్యులు శుక్రవారం మండపేటలో ఎమ్మెల్యే వేగుల్ల జోగేశ్వరరావును కలసి కృతజ్ఞతలు తెలిపారు. చెల్లూరు పీఏసీఎస్ చైర్మన్‌గా దేవళ్ళ వెంకట్రావు, సభ్యులుగా మేడిశెట్టి నాగేశ్వరరావు, తలాటం వెంకటేష్, ఏడిద చైర్మన్‌గా గొడవర్తి సత్యనారాయణ, సభ్యులుగా ఇందుకూరి శ్రీనివాసరాజు, పైన సుబ్బయ్య నియమితులయ్యారు.

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని ఏడిద రోడ్డులోని పెద్దమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆషాఢ మాసం సందర్భంగా పెద్దమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లతో విశేషంగా అలంకరించారు. అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ వాలిన వీరబాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో కేతిన శ్రీనివాస్, మండిపూడి చంద్రశేఖర్, అడ్డాల సత్తిబాబు, చల్లా శివరాం పాల్గొన్నారు.

పంట పండాలంటే..

- మోతాదు మించి ఎరువు వాడరాదు
- అవసరమైన మేరకే వినియోగించాలంటున్న నిపుణులు
- విచక్షణా రహితంగా వాడొద్దని సూచన
- చీడపీడలు విజృంభించే అవకాశం



కె.గంగవరంలో వరి పైరు

కె.గంగవరం: పంట దిగుబడి పెంచడంలో ఎరువుల పాత్ర కీలకం. స్వార్వా కంటే దాళ్వాలో రైతులు ఎక్కువగా ఎరువులను వినియోగిస్తుంటారు. వరి పైరులో అవసరమైన మేరకు ఎరువులు వినియోగించాలని వ్యవసాయ నిపుణులు రైతులకు సూచిస్తున్నారు. అధిక దిగుబడి సాధించాలనే తపనతో రైతులు మితి మీరిన ఎరువులు వేయడం వల్ల చీడపీడలు విజృంభించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో 21,688 హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. దీనిలో కె.గంగవరం మండలంలో 6,344 హెక్టార్లు, కాజులూరులో 7,702, రామచంద్రపురం మండలంలో 7,642 హెక్టార్లలో నాట్లు వేయడం, వెదజల్లు విధానంలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం తొలకరి సాగు ప్రారంభించిన రైతులు కె.గంగవరం మండలంలో 30 శాతం, రామచంద్రపురం రూరల్‌లో 40, కాజులూరు మండలంలో 35 శాతం మేర నాట్లు పూర్తి చేశారు. ఆయా గ్రామాల్లోని సొసైటీల ద్వారా ప్రస్తుతం రైతులకు ఎరువులు అందిస్తున్నారు. కె.గంగవరం మండలంలోని భట్లపాలిక, బాలాంత్రం, అముజూరు తదితర గ్రామాల్లో ఇంకా పూర్తి స్థాయిలో ఎరువులు అందలేదు.

పోషకాలు అవసరం

ప్రతి పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల పోషకాలతో పాటు జింక్, మెగ్నీషియం, బోరాన్, కాల్షియం, సల్ఫర్ వంటి ఇతర పోషకాలు చాలా అవసరం. ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, పరసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మంచి విచక్షణారహితంగా ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు, చీడపీడలు విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మపోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి తరుణంలో వివిధ రకాల ఎరువుల్లో ఉన్న పోషకాల మోతాదు, వాటి ఉపయోగాలు, ఎరువులు వేయాల్సిన సమయంపై రైతులు అవగాహన ఏర్పరచుకోవాల్సిన అవసరం ఉంది.

ఏం కావాలంటే..

ఎకరం వరి పంటకు 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు అవసరం. ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమ భాగాలుగా చేసి, మొదటి దఫా నాట్లు వేసే సమయంలో, రెండో దఫా పిలకలు కట్టే దశలో, పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో, మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలో వేయాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమతాయి.

నత్రజని వాడకం ఇలా..

నత్రజని ఎరువు సమర్థవంతంగా పనిచేయాలంటే బురద పదునుపై చల్లి, 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి 2 రోజులు నిల్వ ఉంచిత తరువాత పొలంలో చల్లడం వల్ల నత్రజని వినియోగం పెరిగి మొక్క దృఢంగా పెరుగుతుంది.

సూక్ష్మపోషక లోపాలు

ప్రధానంగా జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తరువాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి, వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2 నుంచి 5 వారాల మధ్య పొలంలోని పాత నీటిని తీసివేసి కొత్త నీటిని పెట్టాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.

దిగుబడులపై ప్రభావం



ప్రస్తుతం రైతులకు సరైన అవగాహన లేక ఎక్కువగా ఎరువులు వాడుతున్నారు. పంట దిగుబడి ఎక్కువ సాధించాలనే తపనతో ఎక్కువ ఎరువులు వాడకం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. ఎరువుల అధిక వినియోగం వల్ల ఖర్చు పెరగడమే కాక, చీడపీడలు ఆశించి దిగుబడి తగ్గే ప్రమాదముంది. వ్యవసాయ శాఖ సూచనల మేరకు ఎరువులు వినియోగిస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– సద్గురు మూర్తి, ఏఓ, కె.గంగవరం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రామచంద్రపురం: పట్టణంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు భాష్యం స్కూల్ ఏరియా, శ్రీహరి హాస్పిటల్, లలితానగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

సబ్ మేనేజర్‌కు సత్కారం



సబ్ మేనేజరు నాగబాబును సత్కరిస్తున్న బ్యాంకు సిబ్బంది

రాయవరం: వెదురుపాక యూనియన్ బ్యాంక్‌లో సబ్ మేనేజర్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న కె.నాగబాబును యూనియన్ బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఘనంగా సత్కరించారు. బ్యాంకు మేనేజరు మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి మాట్లాడుతూ సామాన్యులకు అందించే ఉత్తమ సేవలు కలకాలం వారి మదిలో నిలిచి ఉంటాయన్నారు. అనంతరం బదిలీపై అనపర్తి బ్రాంచ్‌కు వెళ్తున్న సబ్ మేనేజర్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు. తాడి బులివెంకటరెడ్డి, వడ్డాది రాంబాబు, సత్తి శ్రీనివాసరెడ్డి, బ్యాంకు సిబ్బంది శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం



కపిలేశ్వరపురంలో శిక్షణ పొందిన బీఎల్‌ఓలతో అధికారులు

కపిలేశ్వరపురం: ఎన్నికల విధులపై బూత్‌లెవెల్ అధికారులకు సంపూర్ణ అవగాహన అవసరమని మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, కేఆర్ ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కృష్ణమూర్తి అన్నారు. జాతీయ, రాష్ట్రీయ ఎన్నికల కమిషనర్ల ఆదేశాలు మేరకు శుక్రవారం కపిలేశ్వరపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతిని నిర్వహించారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ మండపేట నియోజకవర్గంలోని 223 పోలింగ్ బూత్‌ల అధికారులకు దశల వారీగా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇటీవల న్యూ ఢిల్లీలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్ నాగం నాగ శివ, ఏడిద సచివాలయం 1 వెల్ఫేర్ అసిస్టెంట్‌లు బీఎల్‌ఓలకు ఎన్నికల విధి నిర్వహణ, ఓటు నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. 166–210 పోలింగ్ బూత్‌ల పరిధిలోని 45 మంది బీఎల్‌ఓలు శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎన్నికల తహసీల్దార్ పీఏ మెహర్ బాబా, డిప్యూటీ తహసీల్దార్ కె.జానకిరామయ్య, సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ వి.దేవేంద్రకుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల పరిస్థితి దయనీయం



ఎంపీడీవో కీర్తిస్పందనకు వినతిపత్రం అందజేస్తున్న రాఘవులు తదితరులు

రాయవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల పరిస్థితి, వారి జీవనశైలి దయనీయంగా ఉందని పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదని, ఒక్కో పంచాయతీలో ఒక్కోరకంగా వేతనాలు చెల్లిస్తూ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారన్నారు. కార్మికుల జీతాల్లో కోతలు విధిస్తున్నారన్నారు. రాయవరం మండలం చెల్లూరు పంచాయతీలో 18 మంది పారిశుధ్య కార్మికులు 25 ఏళ్లుగా పనిచేస్తున్నారన్నారు. వీరికి మూడు నెలలుగా జీతాలు బకాయిలున్నాయని, జీతాలు అడిగితే కొత్త సెక్రటరీ వస్తేనే ఇస్తామంటూ పాలకవర్గం నిర్లక్ష్యధోరణి ప్రదర్శిస్తున్నారని ఆయన తెలిపారు. కార్మికులు ఈ నెల 10 వరకు వేచి చూసి, గత్యంతరం లేని పరిస్థితుల్లో సమ్మె బాట పట్టినట్లు ఆయన తెలిపారు. కార్మికుల సమస్యల పట్ల కార్మికుల సమస్యలను పరిష్కారానికి డివిజనల్ పంచాయతీ అధికారితో సంప్రదించామన్నారు. ఎంపీడీవో కీర్తిస్పందనకు వినతిపత్రం ఇవ్వగా, ఈ నెల 14న జీతాల బిల్లు పెట్టేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. అధికారుల హామీతో సమ్మె విరమింపజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ డివిజనల్ కార్యదర్శి పొట్నూరు ఈశ్వరరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు లంక రాంబాబు, ఏసురత్నం, తాతపూడి శ్రీను, ఎం.సత్యనారాయణ, ఎం.ప్రసాద్, దాసరి రాజు, సవరపు సత్తిబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు ఆర్డీఓ ఆదేశాలు



ద్రాక్షారామలో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ అఖిల

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో సుమారు 250 ఎకరాలకు సాగునీరు అందించే 1.6 కిలోమీటర్ల సప్తగోదావరి పంట కాలువపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఆర్డీఓ దేవరకొండ అఖిల ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీఓకు ఫిర్యాదు చేసిన రైతులతో కలసి ఆక్రమణలను పరిశీలించారు. ఆక్రమణకు గురైన భూమికి మార్కింగ్ వేసి, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలని తహసీల్దార్ బండి మృత్యుంజయరావును ఆదేశించారు. ఆమె వెంట సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి పెట్టా సత్యనారాయణ, ఆర్ఐ వాసంశెట్టి సత్యదేవప్రసాద్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ యు.రమేష్, ఏఈ వి.సుజాత తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు రూ.15 వేల పెన్షన్ ఇవ్వాలి



పినపళ్లలో దివ్యాంగుల సమస్యలను తెలుసుకుంటున్న ప్రతినిధులు

ఆలమూరు: రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ రూ.15 వేల పెన్షన్‌ను మంజూరు చేయాలని పారా స్వచ్ఛంద సంస్థ ల్యాంప్ అడ్వకసి కో–ఆర్డినేటర్ బడుగు సుబ్బయమ్మ, సీబీఆర్ కో–ఆర్డినేటర్ బి.మహిమారావు డిమాండ్ చేశారు. పినపళ్లలో స్థానిక శ్రీసంగిత లక్ష్మీకాంతం కల్యాణ మండపంలో శుక్రవారం దివ్యాంగుల హక్కులు, సంక్షేమంపై సర్పంచ్ సంగిత సుభాష్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కో–ఆర్డినేటర్లు మాట్లాడుతూ, బాలికల అక్రమ రవాణా, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. చిన్నారుల అంగవైకల్యాన్ని గుర్తించి, వారిని భవిత కేంద్రాల్లో చేర్చేందుకు సంస్థ పనిచేస్తుందన్నారు. అనంతరం గ్రామంలో 8 మంది దివ్యాంగుల సమస్యలను ఆలకించారు. ఎంపీటీసీ పెద్దిరెడ్డి పట్టాభి, మాజీ ఏఎంసీ చైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు, ఉప సర్పంచ్ యనమదల రాణి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఆర్టీసీకి లాభాలు

రాజోలు: ఉద్యోగుల సమష్టి కృషితో ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తుందని సంస్థ జోన్–2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం అన్నారు. శుక్రవారం ఆయన రాజోలు ఆర్టీసీ డిపోను సందర్శించారు. డిపో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. అలాగే ఆర్టీసీ బస్సుల ఇంజిన్ కండిషన్ వివరాలను ఆరాతీశారు. ఆర్టీసీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి అవసరమైన మరమ్మతులు చేపట్టేందుకు పలు సూచనలిచ్చి, కొన్నింటికి అనుమతులు మంజూరు చేశారు. ఆయనకు డిపో మేనేజర్ ధనమ్మతో పాటు, డ్రైవర్లు, కండక్టర్లు స్వాగతం పలికారు. డిపో ఆవరణలో ఈడీ మొక్కను నాటారు.

మోగిన వరద గంట

- పెరుగుతున్న గోదావరి ప్రవాహం
- కోటిపల్లిలో ప్రజల ఆందోళన



కోటిపల్లి పుష్కరఘాట్ మెట్ల వరకు చేరిన వరద నీరు

కె.గంగవరం: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి భారీగా వరద నీరు చేరుతోంది. బ్యారేజీ నుంచి జలాలను సముద్రంలోకి విడిచిపెట్టడం వల్ల కోటిపల్లిలో వరద శుక్రవారం ఉదయం నుంచి పెరుగుతోంది. ఉదయం నుంచి గోదావరి గంటగంటకూ పెరుగుతోందని స్థానికులు అంటున్నారు. గోదావరికి వరద పెరగడంతో లంకలో ఉన్న పశువులను రైతులు గట్టుకు చేరవేసి, ఏటిగట్టుపై వాటికి ఆశ్రయం కల్పించే ఏర్పాట్లు చేస్తున్నారు. బ్యారేజీ వద్ద మిగులు జలాలు సముద్రంలోకి వదలడం వల్ల శుక్రవారం రాత్రికి మరింత వరదనీరు చేరుతుందని రెవెన్యూ అధికారులు చెబుతుండడంతో.. మత్స్యకారకాలనీలో ఆందోళన నెలకొంది. కొద్దిపాటి వరదకే ఏటా కోటిపల్లిలోని మత్స్యకార కాలనీ నీటమునుగుతుంది.

ఆందోళనలో ప్రజలు

ఏటా గోదావరి వరద వచ్చే సమయంలో మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలతో పాటు, శేరిలంక గ్రామ ప్రజలకు కంటిమీద కునుకు ఉండదు. కూళ్ల నుంచి బ్రహ్మపూరి వరకు ఏటిగట్టు పలుచోట్ల బలహీనంగా ఉండడంతో వారు మరింత ఆందోళనకు గురవుతున్నారు. సుందరపల్లి వద్ద ఉన్న ఏటిగట్టు ఏటా వరద వచ్చే సమయంలో కోతకు గురవుతుంది. అధికారులు మాత్రం ఎప్పటికప్పుడు తాత్కాలిక చర్యలతో సరిపెడుతున్నారు. వరద ఉధృతి అధికంగా ఉన్న సమయంలో ఇసుక బస్తాలు వేసి గట్టును పటిష్టం చేస్తున్నారు. మరో వైపు ఇసుక లారీల వేగంతో ఏటిగట్టు రహదారి అధ్వానంగా మారింది. గోతులమయంగా మారి ఎక్కడ గట్టు తెగిపోతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వరదను పరిశీలించిన అధికారులు



కపిలేశ్వరపురంలో వరదను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కపిలేశ్వరపురం: గౌతమి గోదావరి నదిలో వరద ఉధృతిని తహసీల్దార్ జి.శ్రీనివాసరావు పరిశీలించారు. డిప్యూటీ తహసీల్దార్ కె.జానకిరామయ్య, సీనియర్ అసిస్టెంట్ వై.శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ పి.సత్తిబాబు, వీఆర్ఏ పి.సూర్యప్రకాశ్‌తో కలసి గోదావరి పుష్కర ఘాట్ వద్ద వరద స్థితిగతులను పరిశీలించారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు లంక గ్రామాల్లో ముందస్తు చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

జనాభా పెరుగుదలతో నిరుద్యోగ సమస్య



పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

రామచంద్రపురం: దేశంలో జనాభా పెరుగుదలతో నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ అన్నారు. కళాశాలలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, నేటి యువత డిగ్రీతో పాటు, స్కిల్స్ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ జీవితం, సామాజిక విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ బి.రవికుమార్ మాట్లాడుతూ, జనాభాలో భారతదేశం తొలి స్థానంలో ఉందని, యువత కూడా ఇక్కడే అధికంగా ఉన్నారన్నారు. ఉపాధి అవకాశాలకు కావాల్సిన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జనాభా వల్ల కలిగే లాభాలు, నష్టాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మజ మాట్లాడుతూ, యువతలో పట్టుదల, పనిపై నిబద్ధత, సహనం, విషయ అవగాహన ఉన్నప్పుడే పోటీ ప్రపంచంలో నెగ్గుకురాగలరని విశ్లేషించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుదర్శన్, డాక్టర్ రమణ, డాక్టర్ లక్ష్మీ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల అందజేత



కాపవరంలో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న ఎంపీపీ భవాని తదితరులు

రామచంద్రపురం రూరల్: కాపవరం జెడ్పీ హైస్కూల్‌కు దూర ప్రాంతాల నుంచి వచ్చే ఆరుగురు విద్యార్థులకు ఎంపీటీసీ సభ్యుడు రెడ్నం సతీష్ శుక్రవారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఎంపీపీ అంబటి భవాని చేతుల మీదుగా ఈ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సహకారంతో గ్రామంలోని పాఠశాలను హైస్కూల్‌గా అభివృద్ధి చేసినప్పుడు ఇతర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తామని మాటిచ్చినట్టు గుర్తుచేశారు. తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు గతేడాది దూర ప్రాంత విద్యార్థులకు ఉచిత ఆటో సదుపాయం కల్పించగా, ఈ ఏడాది విద్యార్థులకు తల్లిదండ్రుల కోరిక మేరకు సైకిళ్లు అందజేసినట్టు వివరించారు. రెడ్నం సతీష్ సేవాతత్పరతను ఎంపీపీ అంబటి భవాని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ యనమదల మంగాదేవి, విద్యా కమిటీ చైర్మన్ గీసాల వీరవెంకట రామ్‌ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి రఘు, హెచ్ఎం ముమ్మిడి సత్యనారాయణ, ఉపాధ్యాయులు వాసంశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.

15న మందపల్లి దేవస్థానం భూముల కౌలు వేలం

కొత్తపేట: మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి దేవస్థానానికి సంబంధించి వివిధ వేలం పాటలు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్టు దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే ఏడాది జూలై 17 వరకూ పలు అంశాలకు టెండర్ కం ఈ–టెండర్లు, దేవస్థానంలోని గానుగ మిల్లులో నల్ల నువ్వుల నూనెను ఆడి భక్తులకు విక్రయించేందుకు లైసెన్స్ హక్కుకు వేలం నిర్వహిస్తామన్నారు. వేణుగోపాల స్వామి దేవస్థానానికి కొత్తపేట, ఊబలంకలో ఉన్న 8.76 ఎకరాల మెరక భూమి 2025–26 నుంచి 2027–28 వరకు మూడేళ్ల కాల పరిమితిలో కౌలు సాగుకు టెండర్ కం బహిరంగ వేలం ఆలయం వద్ద అధికారుల సమక్షంలో నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇతర వివరాలకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మున్సిపాలిటీకి గుర్తింపుపై హర్షం



కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మెరుగైన పారిశుధ్య నిర్వహణలో మండపేట మున్సిపాలిటీకి రాష్ట్రంలో మొదటిస్థానం దక్కడం పట్టణ నివాసితులుగా తమకు సంతోషాన్నిస్తోందని పలువురు అన్నారు. పట్టణానికి చెందిన వడ్రంగి కార్మికుల సంఘం నాయకుడు పొన్నాడ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోని పలువురు పట్టణ ప్రముఖులు శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. చైర్‌పర్సన్ చాంబర్‌లో కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎర్రగుంట అయ్యప్ప, మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.